క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కరకగూడెం: ఎంపీపీ రేగా కాళికా అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ బి.శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

లంకమల్లారం సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: మండలంలోని లంకమల్లారం గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకుడు నెల్లూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ మండల కమిటీ నాయకుల బృందం గ్రామ పంచాయతీలోని లంకమల్లారం, బ్రహ్మంగారిగుట్ట ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామాల్లో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ సైతం అస్తవ్యస్తంగా ఏర్పాటు చేశారని, పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొడిశాల రాములు, ఎస్.సాంబశివరావు, యు.నర్సింహారావు, ఎం.ఉత్తమ్, బి.రాజు, ఉప్పలయ్య, శ్రీరాముల సమ్మయ్య, శ్రీనాథ్, రామ్మోహన్‌రావు, కనకాచారి, సుధీర రమాదేవి, లత పాల్గొన్నారు.

ప్రజలకు సుపరిపాలన అందించారు..



సన్మానం పొందినవారితో అధికారులు

కరకగూడెం: మండలంలోని సమత్ భట్టుపల్లి గ్రామ పంచాయతీ ప్రజలకు సర్పంచ్ శ్రీవాణి సుపరిపాలన అందించారని ఎంపీడీఓ శంకర్ తెలిపారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు పాలకవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీవాణి మాట్లాడుతూ.. తన పదవి కాలంలో అండగా నిలిచిన ప్రతీ ఒక్కరికీ రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలెబోయిన తిరుపతయ్య, ఏపీఓ శ్రీనివాస్, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ మోహన్‌బావు, కార్యదర్శి మారుతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

భద్రాచలంటౌన్: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రహదారులపై ఆటోలు నడిపే సమయంలో డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆటోకు సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌ను డ్రైవర్లు వెంట తెచ్చుకోవాలని ఎస్‌ఐ సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గోత్రనామార్చన, అన్నాభిషేకం, ధూప దర్శనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

గంజాయి స్వాధీనం

భద్రాచలంటౌన్: ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.2 లక్షల విలువైన గంజాయిని భద్రాచలం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ నాగరాజురెడ్డి కథనం ప్రకారం.. ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద ఎస్‌ఐ విజయలక్ష్మి సిబ్బందితో తనిఖీలు చేస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా 7 కిలోల గంజాయి లభించింది. పట్టుబడిన గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశామని, నిందితుడిని భూపాలపల్లి జిల్లాకు చెందిన బౌత్ రాకేశ్‌గా గుర్తించి అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

యువతి అదృశ్యంపై కేసు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ పోలీసులు ఓ యువతి అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని సిద్ధార్థ ఒకేషనల్ జూనియర్, నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ కోర్సు చేస్తున్న ఏపీలోని కూనవరం మండలానికి చెందిన యువతి కనిపించకుండా పోయింది. కళాశాలకు అని చెప్పి ఇంటి నుంచి వచ్చిన ఆమె ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మధుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రి అయితే బస్సులుండవ్..



- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఏజెన్సీ వాసులు
- పనుల నిమిత్తం వెళ్లి ఆలస్యమైతే అంతేసంగతులు..
- ఆర్టీసీ అధికారుల తీరుపై ఆగ్రహం

చర్ల: ఆర్టీసీ అధికారుల తీరుపై ఏజెన్సీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి ఏడున్నర దాటితే బస్సులు నిలిపివేయడం, ఉదయం మళ్లీ ఏడు గంటల వరకు బస్సులను రోడ్లపైకి వదలక పోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. నాడు మావోయిస్టులను బూచీగా చూపి రాత్రి పూట నడిచే బస్సులను రద్దు చేస్తూ వచ్చిన ఆర్టీసీ అధికారులు నేడు ఆదాయం రావడం లేదంటూ నిలిపివేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలైన దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు రాత్రి పూట బస్సులను నడపాలంటూ పదే పదే మొరపెట్టుకుంటున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుడటంతో ఆర్టీసీ అధికారులపై ఏజెన్సీ ప్రజానీకం పోరుకు సిద్ధమవుతున్నారు. భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి దుమ్ముగూడెం, చర్ల మీదుగా వెంకటాపురం, వాజేడు వరకు గతంలో రాత్రి 10 గంటల వరకు బస్సులు నడిచేవి. దూర ప్రాంతాల నుంచి భద్రాచలానికి వచ్చి అక్కడి నుంచి దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం మండలాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేది. కానీ, మావోయిస్టులు బంద్‌లకు, వారోత్సవాలకు పిలుపునిచ్చిన పలు సందర్భాల్లో చర్ల, వెంకటాపురం మండలాలకు సాయంత్రం నాలుగు గంటల తరువాత బస్సులను నిలిపివేసి మళ్లీ ఉదయం 8 గంటల తరువాత పునరుద్ధరించేవారు. ఆ తరువాత అదే పద్ధతిని కొనసాగిస్తూ వచ్చిన ఆర్టీసీ అధికారులు రాత్రి 7.30 గంటల నుంచి చర్ల, వెంకటాపురానికి పూర్తిగా నిలిపివేయడం ప్రారంభించారు. ఇదేంటని ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తే రాత్రి 7.30 గంటల తరువాత బస్సులు పెట్టినా ప్రయాణికులు ఎక్కడం లేదని, బస్సులను ఖాళీగా పంపాల్సి వస్తోందని, ఆదాయం రాకుండా ఎలా బస్సులను నడపాలంటూ వారు ఎదురు ప్రశ్నిచడం మొదలుపెట్టారు. దీంతో రాత్రి బస్సుల కోసం పలుమార్లు ఆర్టీసీ అధికారులను ప్రశ్నించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోవడంతో మూడేళ్లుగా ఏజెన్సీ ప్రజలు ఆటోలు, లారీలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నానరు. దుమ్ముగూడెం, చర్ల మధ్యలో ఎక్కడ దిగినా రూ.100, వెంకటాపురం వరకు ఎక్కడ దిగినా రూ.200 చెల్లించాల్సిన పరిస్థితులు ఎదురవుతుండటంతో దూరప్రాంతాల నుంచి వస్తున్న వారు సరిపడా చార్జీలకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ రోజు రాత్రి 7.30 గంటల నుంచి 10 గంటల మధ్య చర్ల, వెంకటాపురానికి కనీసం 6 టాటామ్యాజిక్‌లు అయినా నడుస్తాయి. వీటిలో ప్రతీ ఆటోలో కనీసం 12 మంది ఎక్కినా ఆరు ఆటోల ద్వారా రోజుకు సగటున 70 నుంచి 80 మంది ప్రయాణిస్తూ ఉంటారు. రాత్రి 7.30 గంటల తరువాత ఇంత మంది దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం మండలాలకు వెళ్తున్నప్పటికీ ఆర్టీసీ అధికారులు మాత్రం సర్వీసు ఉండటం లేదని, డబ్బులు రావడం లేదంటూ బస్సులు నిలిపివేయడాన్ని జనం తీవ్రంగా తప్పుపడుతున్నారు. బస్సులు లేకపోవడం వల్లనే ఆటోలను ఆశ్రయించి అధిక చార్జీలు చెల్లించాల్సి వస్తోందని, అదే బస్సులు ఉంటే ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని అధిక చార్జీలు చెల్లించి ఎందుకు ఆటోల్లో ప్రయాణిస్తామని ఏజెన్సీ వాసులు వాపోతున్నారు. రాత్రి పది గంటల వరకు భద్రాచలం నుంచి వెంకటాపురం, వాజేడుకు తిరిగి ఉదయం 4.30 గంటల నుంచి భద్రాచలానికి బస్సులు నడపాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు.

రాత్రి 10 గంటల వరకూ నడపాలి



భద్రాచలం నుంచి గతంలో రాత్రి 10 గంటల వరకు బస్సులు ఉండేవి. ఇప్పుడు మాత్రం రాత్రి ఏడున్నర దాటితే చర్లకు రావాలంటే చాలా కష్టంగా ఉంటోంది. చర్లకు రూ.80 టికెట్టు ఉంటే రాత్రి కావడంతో ఆటో వాళ్లు కనీసం రూ.వంద లేనిదే రావడం లేదు. అధికారులు రాత్రి పది గంటల వరకు బస్సులు నడపాలి

–పున్నం రామకృష్ణ, చర్ల

తెల్లవారు జాము నుంచి నడపాలి..



గతంలో తెల్లవారుజామున 4.30 గంటల నుంచి భద్రాచలానికి బస్సులు ఉండేవి. ఆర్టీసీ అధికారులు ఈ మార్గంలో బస్సులన్నీ రద్దు చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇక్కడి నుంచి తెల్లవారుజామునే ప్రయాణం ప్రారంభించాల్సి వస్తుండగా బస్టాండ్‌లలో కూర్చుంటే ఉదయం 7.30 వరకు బస్సులు రావడం లేదు.

–కూరపాటి వీర్రాజు, ఆర్.కొత్తగూడెం

వెంకటాపురం మార్గంలో పునరుద్ధరిస్తాం..



గతంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో భద్రాచలం నుంచి వెంకటాపురం, వాజేడు మార్గంలో బస్సు సర్వీసులను రద్దు చేశాం. వాటిని తిరిగి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం బస్సులను మేడారం జాతరకు నడపాలని నిర్ణయించాం. తరువాత బస్సు సర్వీసులను నడుపుతాం.

–రామారావు, డీఎం, భద్రాచలం డిపో

నేడు విద్యుత్ కోత

చర్ల: విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ యోహాను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆసరా పింఛన్లు సకాలంలో అందించాలి

బూర్గంపాడు: వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ప్రతినెల సకాలంలో ఆసరా పింఛన్లను అందించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆసరా పింఛన్‌పై ఆధారపడి వేలాదిమంది నిరుపేదలు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు.

వైరా ఎమ్మెల్యేకు సన్మానం



వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను సన్మానిస్తున్న పిచ్చేశ్వరరావు

అశ్వాపురం: వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు సోమవారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మేడారం వెళ్లి వస్తూ అశ్వాపురంలోని దోసపాటి నివాసంలో టీ తాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పిచ్చేశ్వరరావు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఓరుగంటి రమేశ్, జీఎస్.రావు, శ్రీనివాసరావు, రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో లక్ష్యాలు సాధిద్దాం..



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా జీఎం రామచందర్

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సమష్టి కృషితో సాధిద్దామని ఏరియా జీఎం, మల్టీ డిపార్ట్‌మెంట్ బృందం కన్వీనర్ దుర్గం రామచందర్ పిలుపునిచ్చారు. సోమవారం ఏరియాలోని మణుగూరు ఓసీ, కొండాపురం భూగర్భగనుల్లో మల్టీ డిపార్ట్‌మెంట్ బృందం సందర్శించి అధికారులు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. జీఎం మాట్లాడుతూ.. ఇతర ప్రైవేట్ సంస్థలకు దీటుగా ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ.. సింగరేణిని ఆదర్శంగా నిలపాలని కోరారు. ఉద్యోగులందరూ అంకితభావంతో పనిచేస్తూ.. ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని, పూర్తి యంత్ర సామర్థ్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఏరియా డీజీఎం (ఐఈడీ) వెంకట్రావు, డీజీఎం (పర్సనల్) ఎస్.రమేశ్, డీజీఎం (ఎఫ్అండ్ఏ) అనురాధ, ఇంజనీర్ నర్సిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు రాంగోపాల్, అధికారులు టి.శ్రీనివాసాచారి, టి.వీరభద్రరావు, బి.రవీందర్, బి.రాజేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, మధుబాబు, భాస్కర్‌రావు, శ్రీనివాస్, పీబీ అవినాష్, నవీన్ పాల్గొన్నారు.

టేబుల్ క్యాలెండర్ల ఆవిష్కరణ



భద్రాచలంటౌన్: టేబుల్ క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు



మణుగూరురూరల్: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

భద్రాచలంటౌన్: పట్టణంలోని టీఎన్జీఓస్ కార్యాలయంలో టేబుల్ క్యాలెండర్లను సంఘం జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు, కార్యదర్శి చైతన్యభార్గవ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రజలకి, ప్రభుత్వానికి వారధిగా నిలవాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అదించడంతో ప్రధాన భూమిక పోషించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెక్కా నర్సింహారావు, కటుకూరి నాగభూషణం, లింగమూర్తి, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, రామారావు, అపర్ణ, అంజిబాబు, క్రాంతి, పుల్లారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రజాభవన్ (క్యాంప్ కార్యాలయం)లో మున్నూరు కాపు సంక్షేమ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్లను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల మున్నూరుకాపు సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వన్నం కృష్ణమోహన్, గాండ్ల సురేశ్‌తోపాటు వలసాల వెంకటరామారావు, గోపిశెట్టి శివయ్య, ఆవుల కనకయ్య, మామిడిపల్లి సీతారాములు, గాండ్ల మల్లయ్య, బత్తిని, రామచందర్, జక్కుల రాజబాబు, మామిడిపల్లి శ్రీనివాస్, ఏనుగుల శ్రీను, తోట రమేశ్, ఎస్‌వీ నాయుడు, ప్రవీణ్, తుపూడి శ్రీనివాస్, కేతమల్ల రమణయ్య, లక్ష్మీశెట్టి భద్రం, భువనగిరి శివ, రమేశ్, నర్రా రంజిత్, మిరియాల భాస్కర్, సీతారాములు, కోయ హనుమంతరావు, పొన్నం రాము, జక్కుల సంపత్, మిరియాల శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

దశదినకర్మలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పినపాక: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన తాండ్ర లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు రామనాథం సోమవారం నగదు, బియ్యం వితరణగా అందజేశారు. కార్యకర్తలకు అండగా ఉంటామని, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి కార్యకర్తను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

అశ్వాపురం: పట్టభద్రుల ఓటు నమోదుకు మంగళవారం చివరి అవకాశమని గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణలత కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్క బీఎల్ఓ ధ్రువీకరణ పత్రాలు సంబంధిత గ్రాడ్యుయేట్‌కు అందించి గెజిటెడ్ సంతకం చేసి తిరిగి వెంటనే తీసుకునే విధంగా చూడాలని పేర్కొన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్‌తో ఓటు నమోదు చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వరప్రసాద్, డీటీ రషీద్, ఆర్ఐ నాగమణి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం ప్రాంతంలో గల పాఠశాలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సకాలంలో వైద్యసేవలు అందిస్తే వ్యాధిని నయం చేసుకోవచ్చన్నారు. కుష్ఠు రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తోందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రాజీవ్‌గాంధీనగర్‌లో బాలుర గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, రవి, చంద్ర, విజయ, రాధ, భవాని తదితరులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ద్వారా ఖాళీలు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న సొందె మల్లూరు

దుమ్ముగూడెం: నోటిఫికేషన్ ద్వారా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఏఎస్‌ఎ, ఏవీఎస్‌ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కాలేజీని సందర్శించిన వారు మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సిస్టం ఆపరేటర్, అటెండర్, స్వీపర్, వాచ్‌మెన్ పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సొందె మల్లూరు, బాడిస నాగరాజు, వెంకటేశ్, సోడి సాయిచంద్, భీమరాజు, వరస వీరు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా ఆందోళన

భద్రాచలంటౌన్: ఖమ్మంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి సోమవారం ఓ సమావేశంలో కోరారు. కెచ్చల కల్పన, మునిగల శివప్రశాంత్, మహేశ్వరి, కుమారి, రమ, నాగరత్నం, రేవతి, స్వాతి, శాంతక్క, నసీమా, వరలక్ష్మి పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ఖమ్మం పట్టణానికి చెందిన ప్రజాపంథా నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించడం హేయమైన చర్య అని ఆ పార్టీ మండల కార్యదర్శి దాసరి సాయన్న సోమవారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పేర్కొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ప్రజాపంథా నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. కంగాల కల్లయ్య, కంగాల వెంకటేశ్, కన్నయ్య, సోయం రాజులు, ఏసు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేయండి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో, నిబద్ధతతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాబోయే వేసవి కాలం నాటికి మండల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. తొలుత ఇళ్ల పైనుంచి 11 కేవీ కరెంటు లైన్లువెళ్తున్నాయని, ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగాయని కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్ తెలిపారు. అనంతరం ఇటీవలే పదవీకాలం ముగిసిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను, ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, జెడ్పీటీసీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, దారా మల్లికార్జున్‌రావు, ఎల్లిన రాఘవరావు, కోటగిరి సత్యావతి, కేదాసి రాధ పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా మార్చండి..

అశ్వారావుపేటరూరల్: స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం రాత్రి అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా సందర్శించారు. సత్తుపల్లి డీఎం విజయలక్ష్మికి ఫోన్ చేసి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను ఈనెల 15వ తేదీ నాటికి పరిష్కరించాలన్నారు. ఖాళీగా ఉన్న స్థలాలను చదును చేసి, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి ఆహ్లాదకరంగా మార్చాలని చెప్పారు. ఇన్‌గేట్ వద్ద పబ్లిక్ టాయిలెట్లను నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

మహాసభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

గుండాల: ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జోగా రాంబాబు పిలుపునిచ్చారు. ఆళ్లపల్లి మండలం అనంతోగు ఆశ్రమ పాఠశాలలో సోమవారం రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతోపాటు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ప్రొఫెసర్లు జగన్‌మోహన్‌సింగ్, జి.హరగోపాల్, బుర్రా రమేశ్, బుర్రా వెంకటేశం పాఠశాల విద్య కమిషనర్ దేవసేన హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం భావ్‌సింగ్, నాగేశ్వరరావు, నాగేంద్రబాబు, లక్ష్మీనారాయణ, భానుచందర్, లక్ష్మణ్, లక్ష్మీబాయమ్మ, హైమావతి, విజయశాంతి, యర్రయ్య, వసంతరావు, భద్రమ్మ, రాధాబాయి, స్వాతి, కొమరం రాంబాబు, కల్తీ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

చర్లలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

చర్లరూరల్: స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సోమవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. లింగాపురం, కొత్తపల్లి, గొంపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చీమలపాడు గ్రామంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సోయం రాజారావు, కోటేరు శ్రీనివాసరెడ్డి, కాపుల కృష్ణార్జున్‌రావు, కాపుల నాగరాజు, దొడ్డి సూరిబాబు, ఇర్సవడ్ల రాము, చింతా నాగబాబు, ఈర్ని కృష్ణమోహన్, ఆలం ఈశ్వర్, బోళ్ల వినోద్, కాకి అనిల్, తోటమళ్ల రవి, తోటపల్లి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



మణుగూరురూరల్: నోటీస్ ఇస్తున్న నాయకులు



భద్రాచలంటౌన్: సమ్మె నోటీస్ ఇస్తున్న నాయకులు

మణుగూరురూరల్: ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెకు సహకరించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం మణుగూరు ఎంపీడీఓ చంద్రమౌళికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా 16న దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రంగ, శంకర్, సదానందం, వీరన్న, కన్నయ్య, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో శానిటేషన్, క్రిటికల్, సెక్యూరిటీ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించి, వారిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, రమాదేవి, నరసింహారావు, రమణ, భవాని, చిట్టెమ్మ, మమత, కుమారి, మహబూబ్, అంజలి తదితరులు పాల్గొన్నారు.